సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 15 । జనవరి । 2023



అర్ధరాత్రి అగ్ని ప్రమాదం


ఎల్.కోట మండలం రేగ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత సంభవించిన అగ్ని ప్రమాదంలో 13 పూరిగుడిసెలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.30లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అంచనా.



ఆన్‌లైన్ మోసం

సైబర్ నేరగాళ్లు ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఖాతాపై కన్నేశారు. రూ.2.38లక్షలు మాయం చేశారు. విద్యార్థి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

రామతీర్థంలో గోదాదేవి కల్యాణోత్సవం



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామ స్వామివారి దేవస్థానంలో గోదాదేవి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ

- టీటీడీ నిధులతో ఆలయాల నిర్మాణం
- మూడు జిల్లాల్లో 166 ఆలయాలకు నిధులు
- ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు మంజూరు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార నివాసిత ప్రాంతాల్లో నిర్మాణం



చీపురుపల్లి మండలం రెడ్డిపేట గ్రామంలో నిర్మాణంలో రామాలయం

చీపురుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేందుకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హిందువుల మనోభావాలను గౌరవిస్తూ ప్రతి గ్రామంలోనూ దేవాలయాల నిర్మాణానికి నడుంబిగించింది. ఆలయాలు నెలకొల్పడం ద్వారా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందనే ప్రధాన ఉద్దేశంతో ఆలయాల నిర్మాణానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. దేవదాయ ధర్మాదాయశాఖ నేతృత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నిధులు సమకూర్చుతోంది. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పెద్ద ఎత్తున ఆలయాలు నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార సామాజిక వర్గాలు నివసిస్తున్న ప్రాంతాల్లో ఆలయాలు నిర్మాణానికి ప్రాధాన్యమిస్తోంది.

166 దేవాలయాల నిర్మాణం

విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 166 దేవాలయాలు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అందులో విజయనగరం, మన్యం జిల్లాల్లో 58 ఆలయాలు, శ్రీకాకుళం జిల్లాలో 108 ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరుచేశారు. ఒక్కో ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కేటాయించారు. అందులో రూ.8 లక్షలు ఆలయ నిర్మాణానికి రూ.2లక్షలు విగ్రహాలు కొనుగోలుకు వినియోగించనున్నారు. టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయగా దేవదాయధర్మాదాయశాఖ అధికారులు పనులు పర్యవేక్షిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో...

బాడంగి, బొండపల్లి, గజపతినగరం, ఎస్.కోట, మెంటాడ, మెరకముడిదాం, పాచిపెంట, పార్వతీపురం, పూసపాటిరేగ, వేపాడ మండలాల్లో ఒక్కో ఆలయం, జియ్యమ్మవలసలో రెండు, విజయనగరం, భోగాపురం, సీతానగరంలలో మూడు చొప్పున, నెల్లిమర్లలో ఐదు, చీపురుపల్లిలో 13, గరివిడి మండలంలో 19 ఆలయాల నిర్మాణానికి టీటీడీ నిధులు మంజూరు చేసిందని దేవదాయ శాఖ ఈఈ రమణ మూర్తి తెలిపారు.

కల్యాణ వైభోగం



ధనుర్మాసం ముగింపు సందర్భంగా గరుగుబిల్లి మండలం తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బీవీ అప్పలాచార్యులు వేదమంత్రాలతో స్వామివారి కల్యాణం జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. - గరుగుబిల్లి

గోవిందా.. గోవింద...



సువర్ణముఖి నదీతీరం గోవింద నామస్మరణతో మారుమోగింది. ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లింది. ధనుర్మాసం ముగింపు, భోగిపండగను పురస్కరించుకుని సీతానగరం మండలంలోని బళ్లకృష్ణాపురం, బగ్గందొరవలస, సీతానగరం గ్రామాలకు చెందిన గోవింద మాలధారులు శనివారం గోవింద నామ కీర్తనలతో భజనలు చేశారు. సువర్ణముఖినదీ తీరాన ఉద్యాపన పూజలు చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణం జరిపారు. - సీతానగరం

పల్లెగూటికి పెద్దపండగ



భోగి మంటలు



భోగి పళ్లు పోసి పిల్లలకు ఆశీర్వాదం



సంక్రాంతి ముగ్గు

- ఊరూరా సంక్రాంతి సందడి
- వైభవంగా భోగిపండగ
- ఇంటింటా కొత్త వేడుక



ఇళ్లముందు గొబ్బెమ్మలు

పార్వతీపురంటౌన్: రంగవల్లులతో తీర్చిదిద్దిన వీధులు.. గుమ్మడి పూల అలంకరణతో కొలువుదీరిన గొబ్బెమ్మలు.. ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతూ హరిదాసుల కీర్తనలు.. డూడూ బసవన్నల విన్యాసాలు, పిండివంటల ఘుమఘుమలు.. నూతన వస్త్రాలు ధరించిన పిల్లల కేరింతలు.. ఊరంతా బంధుమిత్రుల సందళ్లు.. పండగకు వచ్చిన కొత్త అల్లుళ్లు... ఇంటికి చేరిన ధాన్యరాసులు.. అన్నదాతల ఆనందోత్సాహాలు... పల్లె ముంగిట గిలిగింతలు పెట్టే చలి మంటలు.. ఆలయాల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు.. దేవదేవుళ్లకు విశేష అభిషేకాలతో పల్లెగూటికి పెద్దపండగ వచ్చింది. ఊరూరా సంక్రాంతి సందడి నెలకుంది.

గొబ్బెమ్మ కొలువులు

పండగ నెల ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి ఇంటి ముందు ఉదయాన్నే కల్లాపు చల్లి అందమైన ముగ్గులు వేసి వాటి మధ్యన గొబ్బెమ్మను పెట్టి పూజిస్తారు. తెలుగు సంప్రదాయం ప్రకారం గొబ్బెమ్మలను గోదాదేవి, లక్ష్మీదేవి, గౌరీ మాతగా భావిస్తారు. గోవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ముగ్గులు మధ్యలో ఉంచి గుమ్మడి, పూలు, పసుపు కుంకుమ సమరి మంచి పూజిస్తారు. ధనుర్మాసం పొడవునా గొబ్బెమ్మను పూజించి సంక్రాంతికి దేవుళ్లకు ఆహ్వానం పలుకుతారు. ప్రతి ఇంటా సంక్రాంతి వెలుగులు ప్రసరించాలని ఆకాంక్షిస్తారు.

భోగిభాగ్యం



డూ..డూ.. బసవన్న విన్యాసం

భోగి పండగ శనివారం ఊరూరా వైభవంగా సాగాయి. భోగిమంటల వేయడం వల్ల సకల దోషాలకు పరిహారం లభిస్తుందన్నది నమ్మకం. గోవు పేడతో చేసిన పిడకలతో వేసిన మంట ద్వారా వచ్చే పొగ పీల్చడం ఆరోగ్యానికి మంచిదని సైన్స్‌చెబుతోంది. అందుకే ఏటా వేకువనే చిన్నాపెద్దా కలిసి భోగి మంట వేసుకుని చలి కాచుకుంటూ పరమానందం పొందుతారు.

సంక్రాంతి.. పితృదేవతలకు శాంతి

మకర సంక్రాంతిని పెద్దల పండగగా పిలుస్తారు. ఆ రోజున పితృదేవతలకు కొత్త దుస్తులు చూపించి తర్పణాలు వదులుతారు. పంచభక్ష్య పరమాన్నాలతో కూడిన నైవేద్యం సమర్పించి పెద్దల ఆశీర్వచనం పొందుతారు. పేదలకు అన్నదానం చేసిన అనంతరం ఇంటిల్లపాది కలిసి భోజనం చేసి ఆనందిస్తారు.

పశువుల పండగ కనుమ..

కనుమను పశువుల పండగగా పిలుస్తారు. ఏడాది పొడవునా వ్యవసాయ పనుల్లో రైతులకు అండగా నిలిచే పశువులను ప్రత్యేకంగా పూజిస్తారు.

18న రాజాం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

- మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా శ్రీకారం



రాజాం రోడ్డు విస్తరణ పనులపై మంత్రి బొత్సతో చర్చిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

రాజాం: రాజాంలో రెండో విడత రోడ్డు విస్తరణ పనులు ఈ నెల 18న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని ఎమ్మెల్యే కంబాల జోగులు శనివారం తెలిపారు. విజయనగరంలో బొత్సను కలిసి ఆహ్వానం అందించామని, ఆయన పనులు ప్రారంభించేందుకు రాజాం వస్తారన్నారు. అంబేడ్కర్ కూడలి వద్ద ఫౌండేషన్ స్టోన్ ఏర్పాటు చేశామన్నారు. అంబేడ్కర్ కూడలి నుంచి జీఎంఆర్ఐటీ వరకూ, బొబ్బిలి కూడలి నుంచి గాయత్రికాలనీ వరకూ రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం రూ.20 కోట్ల నిధులు మంజూరైనట్టు వెల్లడించారు. 80 అడుగుల మేర రోడ్డు విస్తరణతో పాటు అండర్ డ్రైనేజీ, ఫుట్‌పాత్ నిర్మాణం, మధ్యలో డివైడర్ల ఏర్పాటు తదితర పనులు సాగుతాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాలవలస మణికంఠ పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న నాటుకోళ్లు

- పండగ పూట పెరిగిన డిమాండ్
- సీతంపేట ఐటీడీఏ పరిధిలో 30 నాటుకోళ్ల పెంపకం కేంద్రాలు
- 200 మినీ కోళ్లషెడ్ల కేటాయింపు
- పీఎంఈజీపీఎస్ కింద నాటుకోళ్ల పెంపకానికి ప్రోత్సాహం



పెరటికోళ్లకు మేత వేస్తున్న గిరిజన యువకులు



నాటుకోళ్ల పెంపకం యూనిట్ నిర్వహణపై అవగాహన పొందుతున్న గిరిజనులు

భామిని: మన్యంలో నాటుకోళ్ల పెంపకంతో గిరిజనులకు కాసులవర్షం కురుస్తోంది. పండపూట కోళ్లకు గిరాకీ పెరిగింది. ఇగురైనా.. పులుసైనా.. చివరకు ఫ్రై అయినా.. నాటు కోడి కూర రుచే వేరు. అందుకే.. మాంసం ప్రియులు నాటుకోడి కూరను రుచిచూస్తున్నారు. ఏజెన్సీలో ప్రతీ చికెన్ సెంటర్‌లోనూ నాటుకోడి మాంసం దొరుకుతుందంటూ కనిపిస్తున్న బోర్డులే దీనికి నిదర్శనం. ప్రస్తుతం నాటుకోడి కిలో రూ.300 నుంచి రూ.500 పలుకుతోంది.

నాటుకోళ్ల పెంపకంపై అవగాహన

పార్వతీపురం మన్యం జిల్లాలో నాటు కోళ్ల పెంపకం లాభసాటిగా ఉండడంతో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులు కోళ్ల ఫారాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు. కోళ్ల పెంపకంపై శిక్షణ ఇస్తున్నారు. ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీమ్‌లో రుణసదుపాయం కల్పిస్తున్నారు. ఉపాధితో పాటు ఆరోగ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో వాస్సన్ స్వచ్ఛంద సంస్థ సైతం ప్రత్యేక షెడ్ల నిర్మాణం, పెరటి కోళ్ల పిల్లల పెంపకం, అంటువ్యాధులు ప్రబలకుండా వ్యాక్సిన్లు వేయించడం తదితర అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తోంది. ఇప్పటికే మన్యం 30 భారీ నాటుకోళ్ల ఫారాలు ఏర్పాటుచేయగా, మరో 200 మినీకోళ్ల ఫార్మాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది.

30 కోళ్ల యూనిట్లు మంజూరు



సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు 30 నాటుకోళ్ల యూనిట్లు మంజూరు చేశాం. హెచ్‌డీఎఫ్‌సీ ఆర్థిక సహకారంతో యూనిట్లను విస్తరిస్తున్నాం. ఒక్కో యూనిట్‌కు రూ.లక్షా30 వేలు కేటాయించి, 50 కోడి పెట్టలు, 10 కోడి పుంజుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఆదివాసీ పిల్లల్లో రక్తహీనత గుర్తించి ప్రొటీన్స్ గల నాటుకోడి ఆహారం అందించడంతో పాటు ఆదాయం పెంచే చర్యలు చేపట్టాం.

- కల్యాణ్ పాత్రో, ప్రోగ్రామ్ మేనేజర్, వాస్సన్ సంస్థ, సీతంపేట

పీఎంఈజీపీఎస్‌లో...



నాటుకోడి మాంసంలో ప్రోటీన్స్ అధికం. రోగనిరోధక శక్తి ఎక్కువ. నాటుకోళ్లకు గిరాకీ ఉంది. అందుకే యూనిట్లను విరివిగా మంజూరు చేస్తున్నాం. ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీమ్‌లో నాటు కోళ్ల ఫారంల నిర్వహణలో నిరుద్యోగ యువతను ప్రోత్సహిస్తున్నాం. రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నాం.

- డాక్టర్ ఆరిక ఈశ్వరరావు, జేడీ, పశుసంవర్ధక శాఖ, పార్వతీపురం మన్యం జిల్లా

క్లుప్తంగా

ఆ గ్రామంలో కనుమ రోజు సంక్రాంతి



తమ్మయ్యవలస గ్రామం

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఆదివారం జరుపుకోనున్నప్పటికీ తమ్మయ్యవలస గ్రామంలో మాత్రం కనుమ పండుగ రోజున సంక్రాంతి పండుగను గ్రామస్తులు జరుపుకుంటారు. సంక్రాంతి పండుగను కనుమ పండుగ రోజున జరుపుకోవడం కొన్నేళ్లుగా గ్రామస్తులకు ఆనవాయితీగా వస్తోంది. అదే రోజున గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. రాష్ట్రమంతా సంక్రాంతి పండుగను భోగి పండుగ మరుసటి రోజున జరుపుకుంటే తాము మాత్రం కనుమ పండుగ రోజున జరుపుకుంటామని, అదే పద్ధతిని ప్రతీ ఏటా కొనసాగిస్తున్నామని గ్రామానికి చెందిన పలువురు అంటున్నారు.

కోళ్ల ఫారం దగ్ధం

పూసపాటిరేగ: మండలంలోని రాయుడుపేటలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కోళ్లఫారం దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నమ్మి రమణకు చెందిన కోళ్ల ఫారంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. దీంతో సుమారు రెండు వేల కోడి పిల్లలు మృతి చెందినట్లు బాధితుడు చెప్పాడు.

గాయపడిన వృద్ధురాలి మృతి

గంట్యాడ: అగ్ని ప్రమాదంలో గాయపడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రామవరం గ్రామంలో ఈ నెల 8వ తేదీన చుక్క సూరమ్మ అగ్ని ప్రమాదంలో గాయపడింది. తాను ఉంటున్న గుడిసెకు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగగా తీవ్రంగా గాయపడింది. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సు ద్వారా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గంట్యాడ: మండలంలోని నీలావతి గ్రామంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు శుక్రవారం రాత్రి పోలీసులకు సమాచారం అందడంతో వారు పేకాట శిబిరంపై దాడిచేశారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద రూ.12,650లు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కె.కిరణ్‌కుమార్‌నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

భోగాపురం: మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన జోగి గంగాధర్ (40) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల ఆరో తేదీన ఆస్పత్రికి వెళ్లిన గంగాధర్ ఇంటికి చేరుకోకపోవడంతో ఆయన భార్య వసంత ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సంప్రదాయాలను కొనసాగించడం అభినందనీయం



మొయిదలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న ఆచార, సంప్రదాయాలను నేటికీ కొనసాగించడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ఆయన స్వగ్రామమైన మొయిద విజయరామపురంలో శనివారం జరిగిన భోగీ వేడుకల్లో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. నెల రోజుల పాటు గ్రామంలో నిర్వహించిన మేలుకొలుపు కార్యక్రమం చివరి రోజు సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల రోజులుగా వేకువజామున మేలుకొలుపు నిర్వహించి భావితరాలకు సంప్రదాయాలను తెలియజేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, అట్టాడ కనకారావు, శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించాలి

విజయనగరం: మన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మేయర్ విజయలక్ష్మి అన్నారు. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని షాదీఖానా వద్ద పిల్లలకు గాలిపటాల పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంపడాపు శ్రీనివాసరావు సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, సంక్రాంతి తెలుగువారికి పెద్ద పండగన్నారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

- రేగలో 13 పూరి గుడిసెలు దగ్ధం
- పండుగ పూట విషాదం
- రూ.30లక్షల వరకు ఆస్తి నష్టం



అర్ధరాత్రి పూరి గుడిసెల్లో ఎగిసి పడుతున్న మంటలు

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల తరువాత జరిగిన అగ్ని ప్రమాదంలో 13 పూరి గుడిసెలు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో బాధితులు సర్వం కోల్పోయారు. సుమారు రూ.30 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. వివరాల్లోకి వెళ్తే... రేగ గ్రామంలోని హైస్కూల్ సమీపంలో గల పూరి పాకల్లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు రేగాయి. క్షణాల్లో మంటలు అక్కడ ఉన్న పాకలకు అంటుకున్నాయి. ప్రమాద విషయం కొత్తవలస అగ్నిమాపక అధికారులకు సమాచారం అందివ్వగా సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అర్ధరాత్రి ప్రమాదం సంభవించడం, బాధిత కుటుంబాల వారు గాఢనిద్రలో ఉండగా బాధితులంతా కట్టుబట్టలతోనే మిగిలారు. పండుగకు తెచ్చుకున్న సామగ్రి, దుస్తులు సర్వం కాలి బూడిదయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు గొల్లుమన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న తహసీల్దార్ టి.రామకృష్ణ, సీఎస్‌డీటీ ఎస్.రామకృష్ణ శనివారం ఉదయం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్తినష్టం అంచనా వేశారు. సుమారు 30 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండచ్చని అంచనా వేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా బాధిత కుటుంబాలకు పలువురు దాతలు తమ వంతు సాయం అందజేశారు. ఎంపీపీ గేదెల శ్రీనువాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, ఎంపీటీసీ బొడ్డు గణపతి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం త్వరగా అందించేలా కృషి చేస్తామన్నారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు తన వంతు సాయంగా రూ.13వేలు, గుమ్మడి సత్యనారాయణ రూ.10వేలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది రూ.10వేలు, టీడీపీ నాయకుడు కోళ్ల రాంప్రసాద్ రూ.26 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామస్తులు బాధితులకు భోజనం ఏర్పాట్లు చేశారు. వస్త్రాలు అందజేశారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ టి.రామకృష్ణ



బాధితులకు సాయం అందజేస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. సంక్రాంతి వేళ చోటు చేసుకున్న ఈ ప్రమాదాలు క్షతగాత్రుల కుటుంబాల్లో బాధను నింపాయి.



పార్వతీపురం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు



బొండపల్లి: ప్రమదంలో తీవ్రంగా గాయపడిన వాజీర్



బొండపల్లి: ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

పార్వతీపురం: మార్కొండపుట్టి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... కొమరాడ మండలం పరశురాంపురానికి చెందిన బి.విశ్వనాథం, ఎం.సహదేవ్ పార్వతీపురం నుంచి పరశురాంపురం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్కొండపుట్టి సమీపంలో చింతల పోలమ్మ గుడి వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న విశ్వనాథం, సహదేవ్ గాయపడ్డారు. చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి 26పై శనివారం మోటారు సైకిల్ అదుపు తప్పడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరానికి చెందిన ఎం.డి.వాజీర్ (64) తన ద్విచక్ర వాహనంపై విజయనగరం నుంచి గజపతిగనరం వైపు వస్తుండగా ప్రమాదం జరగడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో విజయనగరంలోని సర్వజన కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

బొండపల్లి: మండలంలోని రోళ్లవాక జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారి 26పై శనివారం మోటారు సైకిల్ ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. విజయగనగరానికి చెందిన ఎం.జానకీరావు(55) విజయనగరం నుంచి గజపతినగరం వైపు వస్తుండగా గజపతినగరం వైపు నుంచి విజయనగరం వైపు వెళ్తున్న గుర్తు తెలియని మోటారు సైకిల్ బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ప్రమాదంలో జానకీరావుతో పాటు గుర్తు తెలియని వ్యక్తి కోమాలోకి వెళ్లడంతో ఇద్దరిని విజయనగరంలోని సర్వజన కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామతీర్థంలో గోదాదేవి కల్యాణోత్సవం



స్వామి వెండి మండపం వద్ద గోదాదేవి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్:

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతా రామస్వామివారి దేవస్థానంలో శనివారం గోదాదేవి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఏటా ధనుర్మాస ముగింపును పురస్కరించుకొని భోగి పండుగ నాడు గోదాదేవి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా అర్చకులు వేకువజామున 4గంటలకు స్వామివారికి ప్రాతః కాలర్చన, తిరుప్పావై సేవా కాలం, బాల భోగం నిర్వహించి ధనుర్మాస ఉత్సవాన్ని జరిపించారు. ముందుగా శ్రీ గోదా అమ్మవారిని మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పల్లకిలో గ్రామ తిరు వీధుల్లో ఊరేగించారు. అనంతరం రామ పుష్కరిణి వద్దకు తీసుకువెళ్లి అమ్మవారి విగ్రహానికి నలుగు పూసి స్నానం చేయించారు. గోదా దేవిని పెళ్లి కుమార్తెగా అలంకరణ చేసి దేవాలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వెండి మండపం వద్ద ప్రత్యేక పూజలనంతరం గోదా దేవికి శ్రీ కృష్ణ పరమాత్ముడిచే కల్యాణాన్ని జరిపించారు. అనంతరం యాగశాలలో సుందరకాండ హవనం, సుదర్శన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఐక్యతతో విజయం సాధించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: కొప్పుల వెలమలు ఐక్యతతో విజయం సాధించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. కొప్పుల వెలమ రాష్ట్ర సంఘ క్యాలెండర్‌ను శనివారం మండలంలో పక్కిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొప్పుల వెలమ సంఘ రాష్ట్ర నాయకులు పలు అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా కొప్పుల వెలమలు ఐక్యతతో విజయం సాధించాలని, తమ ప్రభుత్వంలో అందరికీ సామాజిక న్యాయం అందుతుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ రాష్ట్ర కన్వీనర్ రావు శంబంగి(కాకినాడ), కూనిరెడ్డి శ్రీనివాస్(తాడేపల్లిగూడెం), రాష్ట్ర నాయకులు బొమ్మి నాయిని తిరుపతినాయుడు, పోల జగన్, చింతకాయల ప్రసాద్, బంగారు బాస్, రమేష్ శంబంగి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



శ్రీదేవి మృతదేహం

సంతకవిటి : మండలంలో మామిడిపల్లి గ్రామానికి చెందిన పైల శ్రీదేవి(30) అనే వివాహిత శనివారం మృతి చెందింది. సంతకవిటి పోలీసులు తెలిపిన వివరాలు... శ్రీదేవి ఈ నెల 13న పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందినట్టు తెలిపారు. శ్రీదేవి పొందూరు మండలం మునిసిపేట గ్రామానికి చెందిన వివాహిత. ఎనిమిదేళ్ల కిందట మామిడిపల్లి గ్రామానికి చెందిన పైల పోలారావుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల నేపథ్యంలో భర్త పోలారావు కొట్టడంతోనే తన కుమార్తెకు ఈ పరిస్థితి ఏర్పడిందని మృతురాలి తల్లి పొందూరు లక్ష్మి ఆరోపించారు. సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జనార్దనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

ఉపాధ్యాయ ఉద్యమ సారథి నరసింహం మృతి

- సంతాపం తెలిపిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు నరసింహం(ఫైల్)

విజయనగరం పూల్‌బాగ్: ప్రముఖ ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు యు.ఎ.నరసింహం(90) శనివారం తెల్లవారుజామున విజయనగరంలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాస్టారు మరణ వార్త తెలిసిన వెంటనే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని దర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. తన సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఇచ్చే ప్రతిభ పురస్కారాలకు గాను, కమిటీకి మాస్టారు చైర్మన్‌గా ఉంటూ ఎనలేని సేవలు అందించారని అన్నారు. మాస్టారి మరణం ఉపాధ్యాయులకే కాకుండా, తనకు వ్యక్తిగతంగా తీరనిలోటు అని పేర్కొన్నారు.

మాస్టారు ప్రస్థానం

1932వ సంవత్సరంలో సింహాచలంలో జన్మించిన మాస్టారు 1953లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. నెల్లిమర్ల, ఎస్.కోట, పూసపాటిరేగ, వియ్యంపేట, రామతీర్థంలో పనిచేసి, 1990లో పదవీ విరమణ చేశారు. 1983 సెప్టెంబర్ 5న ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయునిగా విశిష్ట పురస్కారం అందుకున్నారు. 1984 సెప్టెంబర్ 5న జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పటి రాష్ట్రపతి దివంగత జ్ఞానీ జైల్‌సింగ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. మాస్టారు మరణ వార్త తెలియగానే నగరానికి చెందిన ప్రముఖులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు నాయకులు, విద్యార్థులు తరలివచ్చి ఆయనకు ఘన నివాళులర్పించారు. మాస్టారు భౌతికాయానికి శనివారం దాసన్నపేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.



నరసింహం మాస్టారు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

పందెంరాయుళ్ల అరెస్ట్

భోగాపురం: మండలంలోని ముడసర్లపేట గ్రామ శివారులో నీలగిరి తోటలో కోడిపందాలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని.. వారి వద్ద నుంచి నాలుగు కోళ్లు, 64,270 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పోలీసుల అదుపులో జూదరులు..

భోగాపురం: మండలంలోని గూడెపువలసలో నిర్వహిస్తున్న పేకాటశిబిరంపై పోలీసులు దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.2,90,110 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

జామిలో..

జామి: మండలంలో యాతపాలెం గ్రామం సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై శనివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు కోడిపుంజులు, రూ.1100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వీరబాబు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రెండు బైక్‌లు ఢీ, నలుగురికి గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం మద్దలవాని చెరువు వద్ద శనివారం ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పెదమానాపురం నుంచి మెంటాడ మండలం కొంపంగి గ్రామానికి కూనిబిల్లి ఈశ్వరరావు, సత్యం, సన్యాసినాయుడు బైక్‌పై వెళ్తుండగా.. ఇంగిలాపల్లి నుంచి ఎదురుగా బైక్‌పై వస్తున్న రమేష్ ఒకరినొకరు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పెదమానాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఈశ్వరరావు, సత్యం, సన్యాసినాయుడులను మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్సై బి.భాగ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా గోదాదేవి కల్యాణం



విజయనగరం: గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని జమ్ము సీతారాముల ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని శనివారం కనులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, శ్రీనివాసరావు దంపతులు కల్యాణం చేపట్టారు. లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దన్నానపేటలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నానపేటలో గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. రామమందిరం వద్ద జరిగిన కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం

- అకౌంట్ నుంచి రూ.2.38 లక్షల మాయం
- పోలీసులను ఆశ్రయించిన ఇంజినీరింగ్ విద్యార్థి

రాజాం సిటీ:

రోజు రోజుకు టెక్నాలజీ పెరిగి అభివృద్ధి ఎంత వేగం పుంజుకుంటుందో.. అంతే వేగంగా సైబర్ నేరగాళ్లు కూడా తమ పందాను మార్చుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఒకరు వాట్సాప్ మెసెంజర్ ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడితే, మరొకరు పేటీఎం ద్వారా నేరాలకు పాల్పడుతూ తమ మోసాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటున్నారు. పోలీసులు, ప్రభుత్వాలు ఎంత అవగాహన కల్పిస్తున్నప్పటికీ విద్యావంతులే ఎక్కువగా సైబర్ వలలో చిక్కుకుని మోసానికి గురౌతున్నారు. ఈ కోవలోనే ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ. 2.38 లక్షలు పేటీఎం ఆధారంగా నగదు మాయం చేశారు. విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న యువకుడు పోలీసులను ఆశ్రయించాడు. సీఐ కె.రవికుమార్ వెల్లడించిన వివరాలు.. వంగర మండలం ఇరువాడ గ్రామానికి చెందిన వేమిరెడ్డి సత్యనారాయణ స్థానిక జీఎంఆర్ ఐటీలో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. రాజాం పట్టణ పరిధి వస్త్రపురి కాలనీలో నివాసం ఉంటూ చదువు కొనసాగిస్తున్నాడు. తన ఫోన్ నంబరు తనకు అమ్మమ్మ అయిన ఇరువాడ సర్పంచ్ పెద్దిరెడ్డి విజయమ్మ స్టేట్‌బ్యాంకు అకౌంట్‌కు అనుసంధానం అయి ఉంది. అలాగే తన సోదరి కావ్య బ్యాంకు ఖాతాకు కూడా ఇతని నంబరునే అనుసంధానం చేశాడు. గత నెల 30న తన అమ్మమ్మ ఖాతాలో ధాన్యం డబ్బులు రూ. 3.34 లక్షలు జమ అయ్యాయి. ఇదిలా ఉండగా సత్యనారాయణ ఫోన్ నంబరు పేటీఎంకు యాప్‌తో యాక్టివ్ అయి ఉంది. దీంతో విద్యార్థి ప్రమేయం లేకుండా తన ఫోన్ నంబరుకు లింక్ అయిన పేటీఎం ద్వారా దపదఫాలుగా విజయమ్మ అకౌంట్ నుంచి రూ.2,36,513లు, తన సోదరి కావ్య అకౌంట్ ద్వారా రూ. 2,277లు ఎటువంటి ఓటీపీలు లేకుండా మాయమయ్యాయని గుర్తించాడు. సదరు బ్యాంకుకు వెళ్లి ఆరా తీసి సైబర్ నేరగాళ్లు తన అకౌంట్ నుంచి నగదు మాయం చేసినట్లు గుర్తించాడు. దీంతో ఏం చేయాలో పాలుపోక శనివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.